క్లుప్తంగా

కుమారస్వామికి షష్టి పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో షష్టిని పురస్కరించుకుని సోమవారం విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.

శిల్పాను కలిసిన బోర్‌వెల్ రహిమాన్



శిల్పాతో బోర్‌వెల్ రహిమాన్

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని సోమవారం బోర్‌వెల్ రహిమాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో నెలకొన్న సమస్యలను శిల్పా దృష్టికి తీసుకెళ్లారు.

సారా విక్రయిస్తే కేసులు



నాటుసారాను చూపుతున్న ఎక్సైజ్ ఎస్‌ఐ

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ జహ్రుల్లా హెచ్చరించారు. మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో సోమవారం నాటుసారా అమ్ముతున్న తప్పెట జాన్‌ను అరెస్టు చేశారు. 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. నాటుసారా విక్రయించినా, తయారు చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కానిస్టేబుళ్లు శంకర్ నాయక్, పద్మనాభం, కుమారి, రామాంజనేయులు, సుధీర్‌కుమార్, శ్వేత తదితరులు ఉన్నారు.

ఆర్టిజన్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

శ్రీశైలంప్రాజెక్ట్: తెలంగాణ రాష్ట్రం ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విద్యుత్ కేంద్రాలలో సుమారు 20,000 మంది ఆర్టిజన్ కార్మికులు పనిచేస్తున్నారు. విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని కొన్నేళ్లుగా కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టిజన్ కార్మికులు సంఘటితమై జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. జేఏసీ పిలుపు మేరకు సోమవారం కార్మికులు సి.సుబ్బారెడ్డి, బి.లక్ష్మయ్య, ఎం.రవి, ఎ.సత్యనారాయణ, సీహెచ్.సరోజిని, జె.చంద్రకళ దీక్షల్లో పాల్గొన్నారు. వీరికి సీనియర్ కార్మిక నాయకుడు జి.కిషన్ సంఘీభావం తెలిపారు.


పీహెచ్‌సీకి వైద్య పరికరాల అందజేత



వైద్య పరికరాలు అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎస్‌బీఐ, హైదరాబాద్ అవేర్ గ్రూప్స్ సహకారంతో వైద్యశాలకు అత్యాధునిక వైద్యపరికరాలు అందజేశారు. సోమవారం వైద్యశాలకు అవసరమైన హైడ్రాలిక్ బెడ్ కాట్, స్ట్రక్చర్, ఆపరేషన్ టేబుల్, వాటర్ ప్యూరిఫైయర్ తదితర వైద్య పరికరాలను అవేర్ గ్రూప్స్ చైర్మన్ మాధవన్, ప్రాజెక్ట్ డైరెక్టర్ వరుణ్ వైద్యులు విజయేంద్ర, జుబేధాలకు అందజేశారు.

రీ సర్వే ప్రారంభం



సర్వేలో పాల్గొన్న అధికారులు

బండిఆత్మకూరు: మండల పరిధిలోని కడమల కాలువ గ్రామంలో సోమవారం భూముల రీ సర్వే ప్రారంభమైంది. ఈ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకొని సర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ పద్మావతి తెలిపారు. ప్రతిరైతు రీ సర్వే పనులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ పర్వీన్, సర్వేయర్ ఫయాజున్, వీఆర్‌ఓ చిన్న వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు



జూపాడుబంగ్లా: దూడకు నట్టల నివారణ మందు తాపిస్తున్న ఏడీ

నందికొట్కూరు: పశువులకు రోగ నిరోధక శక్తి పెంచేందుకు ప్రభుత్వం పశు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. సోమవారం మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. శిబిరాల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పశు ఆరోగ్య శిబిరాల ద్వారా పశువులకు వైద్యం అందించడం జరుగుతుందన్నారు. గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక శక్తి టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

పశువుల ఆరోగ్యం ముఖ్యం

పాములపాడు: పశువులు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత పాడి రైతులదేనని పశువైద్యాధికారి అనిల్ అన్నారు. మండల కేంద్రంలో పశు వైద్యశిబిరం నిర్వహించారు. పశువులు ఎంత ఆరోగ్యంగా ఉంటే ఉత్పత్తి కూడా అదే రకంగా ఉంటుందని వివరించారు. 10 గేదెలకు గర్భనిర్ధారణ, కృత్రిమ గర్భాధారణ నిర్వహించారు. లేగదూడలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. వెటర్నరీ అసిస్టెంట్లు స్వామి, కవిత, నాగేశ్వరరావు, విజయమ్మ, మున్వర్‌బాషా పాల్గొన్నారు.

వ్యాధులకు సకాలంలో చికిత్సలు

జూపాడుబంగ్లా: పశువులు, జీవాలకు సీజనల్‌గా వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండడంతో పాటు సకాలంలో చికిత్సలు చేయించుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ రామాంజినాయక్, డాక్టర్ పావనిరెడ్డి అన్నారు. మండలంలోని పారుమంచాల గ్రామంలో పశు ఆరోగ్య వైద్యశిబిరం నిర్వహించారు. పశువులు, జీవాల్లో వ్యాపించే వ్యాధులను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వాటికి చికిత్సలు చేయించటం వల్ల మెరుగైన పాలదిగుబడి సాధించవచ్చన్నారు. అనంతరం 46 పశువులకు చికిత్స చేశారు. 350 పశువులు, జీవాలకు నట్టలనివారణ మందు తాపించారు. సర్పంచ్ ప్రకాశం, మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఆత్మకూరు పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ రైతులకు సూచించారు. ఎదురుపాడు గ్రామంలో జరిగిన వైద్య శిబిరంలో పశు వైద్యాధికారి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పశువులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు చికిత్సతో పాటు వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తామన్నారు.

31 వరకు వైద్య శిబిరాలు

పగిద్యాల: పశువుల సంరక్షణ నిమిత్తం ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించే పశువైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రాగసంధ్య కోరారు. మండలంలోని పాత ముచ్చుమర్రి పశువైద్య కేంద్రంలో పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. పశువులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు. గర్భకోశ వ్యాధులు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన తదితర అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డెయిరీ యూనిట్ల స్థాపనకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 సబ్సిడీని ముర్రా జాతీ పాడి గేదెలను కొనుగోలు చేయిస్తుందన్నారు.



పగిద్యాల: అవగాహన కల్పిస్తున్న పశువైద్యురాలు



నందికొట్కూరు: పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య



కొత్తపల్లి: ఎముకల పటిష్టతకు మినరల్ మిక్చర్ ప్యాకెట్ల పంపిణీ



పాములపాడు: పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారి

ఫిబ్రవరి 19 నుంచి అన్నదానం

ఆత్మకూరు: శివరాత్రి, ఉగాది పండగల సందర్భంగా మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఫిబ్రవరి 19 నుంచి 25వ తేదీ వరకు శ్రీశైలానికి వెళ్లే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు శ్రీ మల్లేశ్వర దేవస్థానం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఏటా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలరించిన బుర్రకథ



బుర్రకథ వినిపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై రాజమండ్రికి చెందిన విభూది లోవరాజు, బృందం భక్త మార్కండేయ అంశంపై నిర్వహించిన బుర్రకథ భక్తులను అలరించింది. అలాగే రంగారెడ్డి జిల్లాకు చెందిన స్పందన డ్యాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

రేపు సమావేశం

ఆత్మకూరు: ఈనెల 22న అనుమతి లేని లేఅవుట్ యజమానులకు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో సమావేశం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు సోమవారం తెలిపారు.

ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం



కూరగాయలను కొనుగోలు చేస్తున్న అధికారులు

పాములపాడు: ప్రకృతి సాగు ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం అని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మండలంలోని వేంపెంట యూనిట్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏటీఎం మోడల్ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం ఏర్పాటు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, ఏపీఓ విమలమ్మలతో పాటు పలువురు అధికారులు స్టాల్‌లో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, తీగ జాతి, బంతి పూలను పరిశీలించి కొనుగోలు చేశారు. రసాయణాలు వినియోగించకుండా పండించే పంటలు ఎంతో ఆరోగ్యదాయకమని, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. యూనిట్ ఇన్‌చార్జి చక్రవర్తి నాయక్, ఐసీఆర్‌పీ పుష్పలత, ఆలిమ్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు తూకాలకు పాల్పడితే చర్యలు



తూనికలు, కొలతల పరికరాలను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ అనిత

జూపాడుబంగ్లా: వ్యాపారులు తప్పుడు తూకాలతో వినియోగదారులను మోసగిస్తే కేసులు నమోదు చేస్తామని తూనికలు కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ అనిత హెచ్చరించారు. సోమవారం జూపాడుబంగ్లా కేసీ కాల్వ గెస్టుహౌస్ వద్ద తూనికలు, కొలతల పరికరాలకు సీళ్లు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని 12 గ్రామ పంచాయతీలు, ఆరు మజారా గ్రామాల్లోని వ్యాపారులకు నోటీసులు జారీ చేసి వారి వద్దనున్న తూనికలు, కొలతల పరికరాలను సీళ్లు వేయించుకోవాలని సూచించినట్లు తెలిపారు. ప్రతి రెండేళ్ల కోసారి తూనికలు, కొలతల పరికరాలకు సీళ్లు, ముద్రలు వేస్తామన్నారు. సీళ్లు, ముద్రల్లేని పరికరాలతో తూకాలు వేసి వినియోగదారులను మోసగించినట్లు తెలిస్తే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామన్నారు.

విజిలెన్స్ అధికారుల విస్తృత తనిఖీలు



ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఆత్మకూరు: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కె.విశ్వనాథ్, సిద్ధయ్య, ప్రవీణ్ సోమవారం పట్టణంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. సాయిరాం ఫర్టిలైజర్, పురుగు మందుల షాపు, లలిత ట్రేడర్స్, విజయలక్ష్మి షాపుల్లో సోదాలు నిర్వహించి రికార్డులు సరిగా లేకపోవడంతో రూ.9,80,000 విలువ చేసే విత్తనాలు, రూ.1,27,000 ఎరువులు, రూ.4,14,000 విలువ గల స్టాక్ అమ్మకాలను నిలిపేశారు. రికార్డులు సరిగా నిర్వహించకపోయినా, అనుమతులు లేకుండా విక్రయాలు జరిపినా లైసెన్స్ రద్దుకు సిఫారసులు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఏర్పాటు చేశారన్నారు. హెటీరో ల్యాబ్, ఆస్ట్రోటెక్ స్టీల్, ఏపీటీయూఎఫ్, హెచ్ఎఫ్‌సీ ఇండియా లిమిటెడ్, సన్‌కిషాన్ అగ్రీ అండ్ కో కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఎంఎల్‌టీ, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు.

దుండగులను శిక్షించాలి

నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని శాంతిరాం కాలేజీ వద్ద భార్యభర్తలపై దాడి చేసి దోపిడీ చేసిన దొంగలను వెంటనే పట్టుకొని శిక్షించాలని ఎస్‌డీపీఐ నాయకులు కరీముల్లా, అనీఫ్ కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం రాత్రి శాంతిరాం మెడికల్ కాలేజీ సమీపంలో భార్యభర్తలను అడ్డగించి వారిని తీవ్రంగా కొట్టి వారి వద్ద నుండి బంగారాన్ని దొంగిలించిన దుండగులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు.

పింఛన్లపై విచారణ



లబ్ధిదారుడిని పరిశీలిస్తున్న డాక్టర్లు

మిడుతూరు: మండల పరిధిలో మంచానికే పరిమితమై రూ.15 వేల పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను డాక్టర్లు కిరణ్ కుమార్, లభిలాష్, నాగార్జునరెడ్డి రీవెరిఫికేషన్ కోసం పరిశీలించినట్లు ఎంపీడీఓ దశరథరామయ్య తెలిపారు. లబ్ధిదారుల సదరన్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తదితర ధ్రువపత్రాలను పరిశీలించినట్లు చెప్పారు. సదరన్ సర్టిఫికెట్లలో ఉన్న వివరాలు.. వైకల్యనిర్ధారణ పరీక్షల వివరాలతోపాటు అనర్హులను గుర్తించి నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. మండలంలో 44 మంది ఉన్నారని, వారిలో ఒకరు మరణించారని, 43 మంది ధ్రువపత్రాలను పరిశీలించినట్లు చెప్పారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



డ్రోన్ కెమెరాతో నిఘా ఉంచుతున్న ఎస్‌ఐ తిరుపాల్

నందికొట్కూరు: నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాల్ తెలిపారు. సోమవారం బ్రాహ్మణకొట్కూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో జరిగే నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ కెమెరాలను ఉపయోగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ శివారులో జరిగే చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగించడం జరిగిందన్నారు. డ్రోన్ కెమెరాతో పేకాట ఆడుతున్న వారిని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తునట్లు చెప్పారు. ఘటన స్థలాలకు వెళ్లకుండా ఉన్నచోటు నుంచి నేరాలను పసిగట్టడం ఖాయమని తెలిపారు.

భూముల రీసర్వే ప్రారంభం



పాములపాడు: కంబాలపల్లిలో రీసర్వే చేస్తున్న అధికారులు

పగిద్యాల: భూముల రీ సర్వే కోసం పైలట్ గ్రామంగా ఎంపికైన పగిద్యాలలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్(సర్వే) మురళీ ఆధ్వర్యంలో భూముల రీ సర్వేను ప్రారంభించారు. మండల సర్వేయర్, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అసిస్టెంట్స్, రైతులు పాల్గొన్న రీ సర్వేలో రోవర్ సాయంతో భూముల విస్తీర్ణాన్ని గుర్తిస్తున్నారు. 25 బ్లాక్‌లుగా గుర్తించిన ప్రైవేట్ భూముల రీ సర్వేలో రెండు టీంలుగా రెవెన్యూ అధికారులు విడిపోయి సర్వేను వేగవంతంగా ముగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ వెల్లడించారు. ఒక్కో బ్లాక్ కింద 200 నుంచి 250 ఎకరాలు కేటాయించి సర్వేను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. సర్వేయర్ జ్ఞానప్రకాష్, వీఆర్వో నాగన్న, విలేజ్ సర్వేయర్లు, వీఆర్‌ఏలు ఉన్నారు.

రైతులు సహకరించాలి

కొత్తపల్లి: భూ రీసర్వేకు రైతులు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, మండల సర్వేయర్ అనూషరాణి కోరారు. మండల పరిధిలోని గోకవరం పంచాయతీ మజారా గ్రామమైన బట్టువారిపల్లెలో భూ రీసర్వే పనులను ప్రారంభించారు. గ్రామానికి చెందిన 10,042 ఎకరాలను రీ సర్వే చేస్తున్నామని తెలిపారు. వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

80బన్నూరులో నిలిచిన రీసర్వే

జూపాడుబంగ్లా: మండలంలోని 80బన్నూరు గ్రామంలో సోమవారం చేపట్టాల్సిన సమగ్ర భూ రీసర్వే రోవర్ పనిచేయకపోవడంతో నిలిచిపోయింది. రోవర్ పనిచేసిన వెంటనే సర్వే ప్రారంభిస్తామని డిప్యూటీ తహసీల్దార్ నాగన్న తెలిపారు.

పకడ్బందీగా రీసర్వే

మిడుతూరు: భూముల రీసర్వే పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మండల పరిధిలోని దేవనూరు గ్రామంలో రీసర్వే చేశారు. తప్పిదాలకు తావులేకుండా భూ యజమానుల సమక్షంలో సర్వే చేయాలని తెలిపారు.



పగిద్యాల: రీసర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు



కొత్తపల్లి: బట్టువారిపల్లెలో..

రీ సర్వే ప్రారంభం

పాములపాడు: మండలంలోని కంబాలపల్లి గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ సుప్రియ ఆధ్వర్యంలో రీసర్వే ప్రారంభించారు. రీసర్వేకు తగినంత సిబ్బంది అందుబాటులో ఉన్నారని, రోవర్లు, ల్యాప్‌టాప్‌లు ఉన్నాయని వివరించారు. రైతులు అందుబాటులో ఉండి సహకరిస్తే త్వరితగతిన పని జరుగుతుందని చెప్పారు. సర్పంచ్ మేకల భాగ్యమ్మ, మండల సర్వేయర్లు భాస్కర్, కరిముల్లా, వీఆర్వో మగ్బుల్ ఉశేన్ ఉన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అమలు చేస్తున్న పీజీఆర్ఎస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఉమారాణి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. భూమి సర్వేకోసం 4, మరణ, పుట్టిన రోజు ధృవీకరణ పత్రాల కోసం 2, భూమి ఆన్‌లైన్ కోసం ఒకరు చొప్పున వినతులు అందించారని తెలిపారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

పాములపాడు: మండలంలో నిర్వహించే ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 21వ తేదీ పాములపాడు, 22న యర్రగూడూరు, 23న వేంపెంట, 24న ఇస్కాల, 27న జూటూరు-2, 28న జూటూరు1, 29న పాములపాడు, 30న మిట్టకందాల సచివాలయాల్లో క్యాంపు జరుగుతాయని వెల్లడించారు. ఆయా సచివాలయ పరిధిలోని గ్రామస్తులు ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు.

కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు సర్వే

ఆత్మకూరు: పట్టణంలోని అర్బన్ కాలనీలో సోమవారం ఏఎన్ఎం సుబ్బలక్ష్మి, ఆశా భారతి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. చర్మంపై స్పర్శలేని రాగి రంగు మచ్చలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, చేతులు అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, కాళ్ల చెప్పులు జారిపోవడం, చల్లని లేదా వేడి వస్తువుల స్పర్శ తెలియకపోవడం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఏఎన్ఎం సూచించారు.

దాడి కేసులో నిందితులకు రిమాండ్

బండిఆత్మకూరు: ఈనెల 13న పొలం వద్ద ఉన్న మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు దేవదాసుపై దాడి చేసి, అతని వద్ద ఉన్న రూ.1,300 అపహరించిన నిందిలను రిమాండ్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మండల పరిధిలోని పరమటూరు గ్రామానికి చెందిన హరీష్, సుధీర్‌గా గుర్తించి వారిని అరెస్ట్ చేసి, నంద్యాల సెకండ్ క్లాస్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

పంటల నమోదు తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ పవన్ కుమార్

వెలుగోడు: పంటల నమోదు తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సూచించారు. మండలంలోని రేగడగూడూరు గ్రామ పరిధిలోని పంట పొలాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంట నమోదు చేసుకోవడానికి ఫిబ్రవరి 25వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులు ప్రదర్శన

స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తుల స్టాల్‌ను మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి సేద్యంతో పండించిన ఆకుకూరలు, కూరగాయలు మండలంలోని గుంతకందాల, వెలుగోడు, బోయరేవుల గ్రామాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీర్ఘకాలిక రుగ్మతలు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులు ఎంతో మేలు చేస్తాయన్నారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ



సహస్రదీపాలను వెలిగిస్తున్న ఆలయాధికారులు



స్వామిఅమ్మవార్లకు వెండిరథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు



పల్లకీలో విహరిస్తున్న మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందిలో సోమవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు నాగేశ్వర శర్మ, హనుమంత శర్మ, అర్చకులు బెక్కెం శరభయ్య శర్మలు ముందుగా మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అలంకార మండపంలో గణపతి, అలంకార పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పల్లకీ ఉత్సవాన్ని తిలకించారు.

సన్మానం



ప్రభాకర్ రెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

వెలుగోడు: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎంపికైన అంబాల ప్రభాకర్‌రెడ్డిని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం సాగిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, సర్పంచ్ వేల్పుల జైపాల్, నాయకులు షంషీర్ అలీ, గోవిందు, మూర్తుజావలి, బోగోలు సుదర్శనం, మోత్కూరు నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.